సంస్కారి

అరుగుమీాద నించున్న 'రామరాజు' సిగరెట్టు ఆఖరి దమ్ము గట్టిగా పీల్చి విసుగ్గా, ఆ మిగిలిన సిగరెట్టు పీకని రోడ్డుక్రిందకి గిరాటేట్టాడు. అరుగువార కాస్తంత తడిగా వున్నచోట పడిన సరిగ్గా ఆరని ఆ సిగరెట్టుపీక 'సుయ్' మంటూ, 'బుడగ'లోంచి గాలి పోతూన్నప్పుడు చేసే సవ్వడి లాంటిది చేస్తూ, 'తుది నిశ్వాస' సన్ననిపాగ గాలిలోకి వదిలి ఆరిపోయింది. ఆ రోజు ఉదయం నించీ సూర్యుడు కనపడలేదు. అల్లా అని పేద్దవర్షం కొట్టికురిసిందీ లేదు. గంటకీ, అరగంటకీ ఏదో జ్ఞాపకం వచ్చిందానిలా, తుప్పుతుప్పు మంటూ ఒక సన్ననిజల్లు మొదలయి మళ్ళీ అంతలోనే ఆగి పోతోంది. వానవచ్చి వెలిసిన సూచనగా చెట్లఆకులమీాంచి అక్కడో చినుకూ, అక్కడో చినుకూ చిటుకు చిటుకు మంటూ క్రిందపడుతున్నాయి. రామరాజు ఇంటికి తాళం వేసి మెట్లుదిగాడు. రామరాజు వుండేఇల్లు మెయిన్ రోడ్డుకి చివరగా వుంది. కాంపౌండువాల్ లేదు. ఎత్తయిన అరుగులు కల పాతకాలపు పెంకుటిల్లు. అరుగుకు ఆరుగజాల దూరంలో మూాడు గజాల చుట్టుకొలతల ప్రమాణుకట్టిన నిద్రగన్నేరు చెట్టు ఒకటి వుంది. రామరాజు ఆఖరిమెట్టు దిగబోతుండ గానే, జనార్దనంవచ్చేడు. జనార్దనం రాజుకి కొల్లీగ్. రామ రాజులానే బ్రహ్మచారి ఉద్యోగస్థుడు ! జనార్దనం వస్తూనే-

"ఆరినీ ! వూరంతా ఇంత చీదర బాదరగావున్నా, నీ బీటుకి నువ్వు బయలుదేరాల్సిందేనన్రట్రా !" అన్నాడు.

'వెధవది. ఏమీ తోచిచావటం లేదురా !' అన్నాడు రాజు.

"ఎల్లా తోస్తుందిరా చెప్పు ! కాస్త, చీకూ చింతా లేనివాడివికదా, అని ఆఫీసువర్కే—నా ఓవర్ గా చేస్తావా ! తంచన్ గా, అయిదూ కొట్టేసరికల్లా, బూట్లల్లో కాలు దూర్చేస్తావు ! ఇంటి దగ్గర నలుగురు పెళ్లాలూ, అయిదు గురు పిల్లలూ ఎదురు చూస్తోన్నట్లు ఉరకలు పరుగులతో ఇంటికివచ్చి పడతావ్ ! పోనీ ఏ తత్వశాస్త్రమన్నా చదివి జ్ఞానివవుతావంటే, అల్లాటప్పా సినిమాపత్రికలూ, పంద్రెండు రాజుల కథలూ, తప్ప వేరే గ్రంథాలు తమకు రుచించవాయె ! హాయిగా పెళ్ళిచేసుకుంటే ఈ నాటికి నలుగురు పిల్లల తండ్రివై, 'గృహమేకదా స్వర్గసీమా' అంటూ పాడు కుంటూ కూర్చుందువు ! నీకు ఈ ఏకాకితనమూ కాకితనము తప్పేది !" అన్నాడు జనార్దనం.

"నా మాట వదిలేయ్ ! తమరు చేస్తోన్న పనేమిటో చెబ్దూ గురూ !" అన్నాడు రాజు. నడుస్తూ ఇద్దరూ రోడ్డె క్కారు.

"నాకు పేరుకి పెళ్ళికాలేదన్న మాటేకాని, అంతకు రెట్టింపు సంసారం భరాయించాల్సి వుంది. పెళ్ళికెదిగిన చెల్లెళ్లూ, మెడిసిన్ చదూతున్న తమ్ముడూ, పేకాటమానని పితృపాదులూ, పురుటి మంచం దిగని మాతృమూర్తీ వీళ్ళం దరితో పాటు, మెడకో డోలుకూడా కట్టుకుని నా సంసారం

ఈతి బాధలు తప్పించుకోనా! నీలా బేవూచీ మనిషి నయితే ఈ పాటికి ఒక పెళ్ళేం కర్మ! నాలుగు పెళ్ళిళ్ళు చేసుకునేవాణ్ణి!" అన్నాడు.

"వెధవాయీ! నాలుగు పెళ్ళిళ్లో అంటున్నావు! నువ్వేదుస్తున్నది గవర్నమెంటుజాబ్ అని మర్చిపోయేవా!" అన్నాడు రాజు.

ఇద్దరూ వాళ్ళకి అలవాటు అయినచోటు అయిన బస్టాండుకి వొచ్చారు. బస్టాండు రాజు ఇంటికి ఫర్లాంగు దూరంలో ఎగువకివుంది. బస్టాండుకీవల, ఒక గంగరావిచెట్టు దానిక్రింద పెద్ద బండరాయి వుంది. దానిమీద ఆ ఇద్దరు మిత్రులూ, రాత్రిఎనిమిదిగంటలదాకా, కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటారు. వచ్చేప్పుడూ, వెళ్ళేప్పుడూ, ఆగే బస్సుల్లోంచి దిగుతూన్న జనాన్ని ఎక్కుతోన్న సామాన్లనీ చూస్తూ, వాళ్ళ అందచందాల గురించీ, చీరెసారెల గురించీ, మాట్లాడుకుంటూ కూర్చుంటారు.

ఆ చెట్టు కొమ్మల రెమ్మల నీడలకి చివరగా రేకులతో అమర్చివున్నచిన్న కిల్లీకొట్టువుంది. దానికికాస్తంత ఎడంగా నాలుగు రేకులు కప్పివున్న షెడ్డు ఒకటి వుంది. బస్సుల కోసం ఎదురుచూసే స్త్రీలూ, పిల్లలూ, ఆ షెడ్డులో పెట్టెలూ, గోనెసంచిమూటలూ, పడేసుకుని కూర్చుంటారు. ఆ షెడ్డు అంతా వేరుశనగతొక్కలూ, అరటిపళ్ళతొక్కలూ ఫలహారాలుచేసి పారేసిన ఎంగిలి ఆకుముక్కలూ, చిన్న పిల్లలుపోసిన ఉచ్చలతో, చితచితలాడుతూ కుళ్ళుకంపులు కొడుతూ వుంటుంది. పెద్ద పెద్ద గాలి దుమారాలు వచ్చి

నప్పుడు ఆ పెద్దులోని, గ త్తరంతా దానికదే ఎగిరి బయటకి పోవాల్సిందే తప్ప, ఆ పెడ్డులో చీపురువేసి తుడిచే పని వాళ్ళు ఎవరూ వుండరు. మెయిన్ రోడ్డు కిరుప్రక్కలా పంట చేలు వున్నాయి. ఎండాకాలము నాలుగు నెలలూ తప్పించి మిగతా కాలమంతా పచ్చగా ఆకుపచ్చగా కంటికినిండుగా చల్లగా కన్పడుతుంది అక్కడి ధరిత్రి! పెద్దపట్టణమూ కాక, పల్లెపట్టూ కాక, త్రిశంకు స్వర్గముగా వుంటుంది ఆ వూరు! మెయిన్ రోడ్డు మటుకు తారురోడ్డు!

రాజు ఇంటివద్దనించి బస్టాండువరకూ ఇళ్ళులేవు! రోడ్డుకిరుప్రక్కలా పొలాలున్నాయి. బస్సు దిగిన వాళ్ళు వూళ్ళోకి రావాలంటే 'రాజు' ఇల్లు దాటిరావాలి. ఊరికి మైలురాయిలా వుంటుంది రాజు ఇల్లు. ఆ ఇల్లు దాటినాక, గొల్లల ఇళ్లు వున్నాయి. ఆవుల్నీ గేదెల్నీ మేపుకుని, ఊరి కామందులకి, పాలు, పెరుగూ, నెయ్యీ, అమ్ముకునే గొల్లల ఇళ్ళు అయిదారు వందల గడపదాకా వున్నాయి. అందుకే ఆ ఏరియాని, గొల్లగూడెం అంటారు. గొల్లగూడెం శివార్లలో 'హోటలు నిర్మలా' వుంది. భోజన ఫలహారాలేకాక లాడ్జింగ్ సౌకర్యంలోకూడా, నీటుగా వుండే హోటలు అదొక్కటే! బస్సులోంచి, నీటుగా ముస్తాబయినవాళ్ళు దిగి, రిక్షావాళ్ళని ఏదయినా హోటలుకి పోనిమ్మంటే, రిక్షావాళ్లు షూర్ గా వాళ్ళని 'నిర్మలా'కే తీసుకువస్తారు. 'నిర్మలా' నించి ఊరుపొడుగ్గా గతుకుల రోడ్డుతో, అస్తవ్యస్తంగా ముందు వెనకలుగా వున్న ఇళ్ళతో, చాలా దూరం, జరాభారంతో నడవలేని, జర్జరీ భూతమైన శరీరంలా, ప్రయాసపడుతూ,

పరివ్యాప్తమయివుంది. రాజూ, జనార్దనం వచ్చి కూర్చున్న అరగంటకే ఒక బస్సు వచ్చింది. హడావిడిగా, షెడ్డులో నిల్చునివున్న ప్రయాణికులు ఎక్కారు. ఆ షెడ్డుఅంతా కాళీ అయింది. బస్సులోంచి ఒక్క అమ్మాయి దిగింది. చిన్న బెడ్డింగూ ఒక ట్రంకుపెట్టీ ఒక గోనెసంచిమూట కంచు మరచెంబూ క్రిందకిదింపి, ఆ సామాను తనచుట్టూ పేర్చుకుని అటూ ఇటూ చూస్తూ, నిలబడింది. బఁయ్ బఁయ్ మంటూ రెండుసార్లు బస్ హారన్ ప్రయోగించి, దూరాన్నించి ఇంకెవరూ పెట్టెలూ, మూటలూ పట్టుకుని రావటంలేదని నిర్ధారణచేసుకున్నాక బస్‌ని పోనిచ్చాడు బస్ డ్రైవరు! ఆ అమ్మాయి బస్సువెళ్ళిన అర్థగంటవరకూ, అలా రోడ్డు మీదకు చూస్తూ నించుంది. ఆ అమ్మాయిని చూస్తూకూర్చున్నారుమిత్రులిద్దరూ! ఆ చుట్టుప్రక్కల కనుచూపు మేరలో ఎక్కడా రిక్షాలు వస్తున్న సూచనలులేవు! కాటుక పులుముకుంటూన్నట్లు, ఆకాశం నాలుగు వెంపులనించీ, చిక్కటి, చీకట్లు ముసురుకుంటున్నాయి. రోడ్డుమీద వానకి తడిసి నించున్న ఎలక్ట్రిక్ దీపాలు, దిగాలుగా వెలగలేక వెలుగుతున్నాయి. సన్నగా, చాలా సన్నగా చినుకులు కూడా రాలటం ప్రారంభించేయి! రాజు ఒక్కసారి నిటారుగా లేచి నిలబడి, ఒళ్ళు విరుచుకుని ఆవలించాడు. జనార్దనంకూడా లేచి నిలబడి, రాజుకేసి చూసి-

"ఇంకా ఆరన్నా కాలేదురా! అప్పుడే ఇంత చీకటడిపోయిందే! వెధవది మబ్బువల్ల కామాల్ను!" అంటూ నసిగాడు.

"హూఁ!" అంటూ పరధ్యానంగా ఆ అమ్మాయి వెంపు చూస్తో నడిచాడు. జనార్దనం గుండె జల్లుమంది! ఎడమకన్ను అదిరింది! రాజు పద్దతి జనార్దనంకి బాగా తెలుసును! వంటిగావున్న అమ్మాయిలతో పరిచయాలు సంపాదించటం, ఇంటికి పట్టుకురావటం, ఆ తర్వాత వ్యవహారాలు, అవీ మరీ ముదిరితే, పదో పరకో పారేసి వదిలించుకోవటం రాజు నడిపే తతంగం అంతా జనార్దనంకీ ఈవరకే కొట్టిన పిండి అయింది!

"పాపం! ఎవరో ఆ అమ్మాయి! చిక్కులో ఇరుక్కుంది!" జాలిగా అనుకున్నాడు జనార్దనం!

ఆ అమ్మాయి దూరానికి ఒంటిగా జాలిగా, దిగాలుగా నించున్నట్లు కన్పించింది. దగ్గరగా వెళ్ళి చూస్తే, నిబ్బరంగానే కన్పించింది జనార్దనానికి. సాధారణమయిన నేత చీర కట్టుకుంది. రెండు చేతులకి రెండేసి ఎర్రని గాజు గాజులున్నయ్! మెడలో సన్నటి పొడుగాటి చెయిన్ వుంది. కోలముఖమూ, సన్నగా చీలికగావున్న నల్లటి కళ్ళు, నుదురు మీదకు వుంగరాలుగా తిరిగిపోయే నొక్కునొక్కుల చిన్న జెడా, సన్నగా, నాజూకుగా, లేతగా, తెల్లని శరీరమూ రాజు కంటినిండా చూసాడు.

"ఎక్కడికి వెళ్ళాలండీ!" చనువుగా అడిగాడు రాజు. ఆ అమ్మాయి కంగారు పడిపోతుంది, అనుకున్నాడు జనార్దనం. ఆ అమ్మాయి కళ్ళు విప్పుకుని చూసింది రాజువైపు.

"వూళ్ళోకేనండి! రిక్షాలు ఒకటీ కనపడటంలేదూ!" ఎన్నాళ్ళబట్టో తెలుసున్నంత ఫ్రీగా అంది.

"ఇదే ఆఖరు బస్సు! పైగా చలిగా వానగా వుంది! అంచేత రిక్షా వాళ్ళు ఇటు వుండటంలేదు. స్టేషను దగ్గర వుంటారు. స్టేషను రెండు మూడు ఫర్లాంగులు వుంటుంది ఇక్కడికి! పోనీ పిల్చుకొని వద్దామన్నా మావద్ద సైకిళ్ళు లేవు! చీకటి పడిపోయిందికదా! మేము మా ఇంటికి పోతాము! మీరు వంటరిగా నిలబడ్డారని పలకరించాను! ఏమీ అనుకోకండి!" అన్నాడు రాజు.

"అనుకోటానికేముంది ఇందులో! ఏదన్నా ఖాళీబండి ఇటు వెంపు వచ్చేదాకా, కాస్త సాయంవుండకూడదా మీరు?" అంది ఆ అమ్మాయి.

"చలివేస్తోంది! ఇంక కూర్చోలేము! మీరెక్కడికి వెళ్ళాలో చెప్పండి! ఇద్దరం వున్నాముకదా! మీకు తోడుగా వస్తాము!" అన్నాడు రాజు.

"నా కీవూరుకొత్త! ఏదయినా హోటలుకి వెళ్ళాలి. మరి చుట్టాలూ, స్నేహితులుకూడా లేరు." తనలోతనుగా అనుకుంది. రాజు కనుబొమ్మలు పైకెగిరాయి. జనార్దనం వింతగా చూసాడు ఆమె వెంపు! చీకటి మూలంగా ఈ యువకుల ముఖభంగిమల్ని ఆమె కనిపెట్టగల సావకాశం లేకుండగా పోయింది. వీళ్ళతో మాట్లాడుతూనే రోడ్డు వెంపు ఆశగా చూస్తోందాయువతి! రిక్షాలు వస్తాయనే ఆశ గగన కుసుమమే అయ్యింది!

"మీకు తెలిసున్నవాళ్ళు లేరా ? అయితే ఏ హోటలుకి వెడదామనుకుంటున్నారు ?" అన్నాడు సాను భూతి గుమ్మరిస్తూ రాజు.

"నాకు తెలుసున్నవాళ్ళు ఎవ్వరూ లేరండీ ! నాకీ వూరు కొత్త ! ఏ హోటలు మంచిదో నాకెట్లా తెలుస్తుంది ? మీకు ఏది మంచి ప్రాంతమని తెలుస్తే ఆ హోటలుకే దారి చూపండి. ఈ పూటకి హోటలులో వుండి, తెల్లవారి నింపాదిగా, వుండటానికేదైనా పోర్షన్ వెతుక్కుంటాను !" అంది ఆ అమ్మాయి.

'దొరికావ్ బిడ్డా !' అనుకున్నాడు, జనార్దనం. ఎగిరి గంతేయబోయి తమాయించుకున్నాడు రాజు.

"చూడండి ! మీకీ వూరు అంతా కొత్త అంటున్నారు. ఇప్పుడా రాత్రి కావస్తోంది ! చూస్తూ చూస్తూ ఆడపిల్ల ఒంటరిగా హోటలులో దిగటం, అందులోనూ అర్ధ రాత్రి పూటా, ఉండటంఏమంత మంచిదిగా వుండదు. మీరు చదువుకున్న వాళ్ళల్లా కనుపించుతున్నారు. అనవసరంగా సంకోచాలు పెట్టుకోనట్టయితే, మీ కభ్యంతరం లేనట్టయితే..." ఆగాడు రాజు.

"లేనట్టయితే ?" అంది ఆ అమ్మాయి.

"ఇక్కడికి దగ్గరే మా ఇల్లు ! ఆమాటకొస్తే మా ఇల్లు దాటిపోతేనేగాని, వూరు రానేరాదు. ఈ పూటకి మా ఇంట్లో వుండి, తెల్లవారినాక మీ తిప్పలేవో మీరు పడండి !" అన్నాడు రాజు.

"నా కలాంటి సంకోచాలూ బిడియాలూ లేవు స్మండీ ! వుద్యోగాలు చేసుకుంటున్నవాళ్ళం అలాంటి శషభిషలు పెట్టుకుంటే, రోజులు దొర్లటం ఎల్లాగండీ ! పదండి. వానకూడా వచ్చేట్టుంది !" అన్నది.

"మావాడి ఇల్లు చాలా పెద్దదిలెండి. ఇహిహి!" అని నవ్వాడు జనార్దనం. రాజు గుడ్లురిమి చూసాడు. కాని ఆ చీకటిలో జనార్దనానికి రాజు ముఖం కన్పించలేదు. ఆ అమ్మాయి గోనెసంచీమూటా, మరచెంబూ తీసుకుంది. ఇద్దరు మిత్రులూ, ట్రంక్ ఒకరూ, బెడ్డింగు ఒకరూ తీసుకున్నారు. రాజు మూలంగా, తను ఒక అపరిచితురాలి బెడ్డింగు మోయవలసి రావటం జనార్దనంకి మాచెడ్డ విసుగు కలిగింది. 'దొంగ వెధవ! అమర్చటం నా వంతూ, ఆరగింపు-వాడివంతూనూ! ఏం చేయను ? నాకా ధైర్యం లేదు' అనుకున్నాడు జనార్దనం. ఆ కబురూ ఈ కబురూ చెప్పుకుంటూ రాజు ఇల్లు చేరాడు. ఆ అమ్మాయి పేరు నాగమణి అనీ, మిడిలుస్కూల్లో టీచరుగా వచ్చిందనీ తెలుసుకున్నారు మిత్రు లిద్దరూ ! వీధి గదితలుపు తీసి లైటువేసాడు రాజు. దీపంకాంతిలో ఆ అమ్మాయి తడిసీతడవని దుస్తుల్లో విరిసీ విరియని సన్నజాజిలా వుంది ! ఆ పెద్దగదిలో నాగమణి, తన మూటనీ, చెంబునీ, బెడ్డింగునీ, ట్రంకుపెట్టెనీ ఒక వారగా పెట్టి నించుంది. సామాన్లు లోపల పెట్టేక -

"ఇక వస్తారా !" అంటూ జనార్దనం వెళ్ళబోయాడు.

"వుండరా! ఏమండీ మీరు భోజనానికి హోటలుకి వెళ్ళరూ!" అన్నాడు రాజు.

"వద్దులెండి! ఈ చీకటిలో చలిలో భోజనానికి హోటలు వెతుక్కుంటూ పోలేను. ఈ పూటకి కాలక్షేపం చేసేస్తాను. తెల్లారినాక చూసుకోవచ్చును, అన్నపానాల సంగతి!" అంది నాగమణి.

"అయితే నేను పోతాను ఆ కోసాకి ఏడవాలి ఒక్కణ్ణీనూ! అరే రాజూ! వస్తారా. విష్‌యూ గుడ్ లక్!" అంటూ వెళ్ళిపోయాడు జనార్దనం.

"లోపలికి రండి!" అన్నాడు రాజు ప్రక్కగదిలో లైటువేసి

"ఇందులో మీ సామాన్లు పెట్టుకోండి!" అన్నాడు. నాగమణి ఒకొక్క సామానే తెచ్చి, రాజుగది ప్రక్కనున్న గదిలో పెట్టుకుంది. బెడ్డింగు విప్పుకుని ఒక సాదాచీర, జాకెట్టూ తీసుకుని తలుపు జేరవేసుకుని, బట్టలు మార్చుకుంది. రాజు ఇల్లంతా చూపించాడు నాగమణికి! రామరాజు వుంటోన్న ఇల్లు పాతకాలపు మండువా ఇల్లు! మధ్యన హాలూ, నాలుగు వెంపులా పెద్ద పెద్ద గదులూ, వీధి వెంపూ, పెరటివెంపూ పెద్ద పెద్ద ఎత్తయిన అరుగులూ వున్నయ్. ఎడమవెంపు గదులు తాళాలు వేసివున్నయ్! అందులో ఇంటివారి సామాన్లు వున్నాయిట. కుడివెంపునున్న రెండు గదులూ రాజు వాడుకుంటున్నాడు. అందులో ఒక గదిలో నాగమణి తన సామాను పెట్టుకుంది. పెరటివెంపు నున్న రెండుగదులూ జారిపడిన పెంకుముక్కలతో గత్తరగా

వున్నాయి. పెరటిలోనికి వెళ్ళాలంటే ఈ గదుల్లో దేనిలోంచో వక దానిలోంచి వెళ్ళవచ్చును. రెండు గదులలోంచీ పెరట్లోకి గుమ్మాలున్నాయి. పెణకలు జారిపోయి ఆ గదుల గుమ్మాలూ, తలుపులూ, కదలిపోతూ, నెత్తికి తగుల్తూ వుంటాయి. వీధివెంపు పొడుగ్గా పెద్దగదీ దానిలోంచి వీధిలోకి ద్వారమూ, ఎత్తయిన అరుగులూ వున్నాయి. పెరటివెంపు వున్న గదుల్లోని ఒకగదిలో నాలుగు రాళ్ళు పెట్టి ఒకపొయ్యి, దానిమీద పెద్దకుండా, దానిమీదకి కుండ మూకుడూ మూతా వున్నాయి. రాజు అందులో నీళ్ళు కాయించుకుంటూ వుంటాడు.

పెరట్లో అరుగుకి కాస్త ఎడంగా మంచినీటి బావి చుట్టూ సిమెంటు చేసిన చప్టాతో వుంది. పెరడుచుట్టూవున్న ప్రహారీగోడ పడిపోయిన చిహ్నంగా ఇటుకలు మట్టీ, కుప్ప కుప్పలుగా పడివున్నాయి. పెరట్లో అక్కడక్కడా రక్కిన చెట్లూ, ముళ్ళగోరింటచెట్లూ, తుప్ప తుప్పలుగా వున్నాయి. రెండు మూడు కొబ్బరిచెట్లు సన్నగా నిటారుగా ఆకాశంలోనికి చొచ్చుకుపోయేట్లు నిలబడి వున్నాయి. ఆ ఇంటికి వలెనే ఆ కొబ్బరిచెట్లకికూడా వార్ధక్యదశ వచ్చినట్లుంది. ఎండిపోయిన చిన్నచిన్న మట్టలతో వున్నాయి అవి. ఇల్లంతా గచ్చు పగుళ్ళు విచ్చింది. గోడలకి పెచ్చులూడిపోయాయి. రాజువుండే గదులు మటుకు పరిశుభ్రంగావుండి నీలిరంగు వేయబడివున్నాయి. రాజు పడుకునే గదిలో సీలింగ్‌ఫానూ, దోమతెర మంచం, టేబులుమీద మంచి ట్రాన్సిస్టరు రేడియో వున్నాయి. అలమారలో ఖరీదయిన

సెంటుబాటిలూ్నా, పౌడరూ, స్నో, క్యూటెకూ్నా మొద లయిన సామాన్లు అన్నీ చెల్లాచెదరుగా వున్నాయి. ఒక వెంపు మూడు అడుగులున్న చిన్న గాడ్రెజ్ బీరువా వుంది. ఇల్లంతాచూసి వచ్చాక,

"చాలా పెద్దఇల్లు ! అద్దె ఎంత ఇస్తున్నారు ?" అంది నాగమణి.

"కరెంటుకాక నలభయి రూపాయలు !" అన్నాడు రాజు.

"ఇంత పెద్దఇల్లు మీా కనవసరమే ! మీారుండేది ఒక్కరేకదా ! ఎందుకు ఇంత ఇల్లు తీసుకున్నారు" అంది మణి.

"రూం తీసుకుని వుండొచ్చును. కానీ నాకు పదిమందిలో గలగలలాడుతూ వుండటం ఇష్టంలేదు. ఇక్కడ పరిసరాలు ప్రశాంతంగా ఏకాంతంగా వుంటాయి. అంచేత అద్దె ఎక్కువయినా ఈ ఇల్లు తీసుకున్నాను. ఇందులో కూడా మాకో గది ఇయ్యి అంటే మాకోగది ఇయ్యి అంటూ కొందరు విద్యార్థులు తయారయ్యారు నేను ఇవ్వదల్చుకోలేదు. వుండేది ఒకళ్ళు ఇద్దరూ కుర్రాళ్లు అయినా వాళ్ళకోసం వచ్చే సిబ్బందితో ఇల్లంతా ఒక పెద్ద ధర్మసత్రం అయి పోతుంది. అంచేత ఇల్లంతా నాక్రిందే వుంచేసుకున్నాను" అన్నాడు రామరాజు.

రామరాజుకి నెలకి రెండు మూడు వందలలోపు జీతం వస్తూంది. వాళ్ళు అయిదుగురు అన్నతమ్ములు. రామరాజు ఆఖరివాడు. తల్లీతండ్రీ లేరు. రాజువాళ్ళకి బాగా పొలాలు

కూడా వున్నాయి. రాజుకి ఏడాదికి పొలాలమీద మూడు వేల రూపాయలదాకా వస్తాయి. అన్నగార్లల్లో ఇద్దరు స్వంతఊళ్ళో వుండి వ్యవసాయం చూసుకుంటున్నారు. ఇద్దరు దూరప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వాళ్ళకి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా, "రామరాజు"ని వివాహం చేసుకొమ్మని తమ బంధువర్గంలో ఎవరెవరి ఆడపిల్లలు ఎంతెంత చలాకీగా వుండేదీ, ఎవరెవరు ఎంతెంత కట్నాలుముట్ట చెప్పేదీ, పదేసి అరటావుకాగితాల వివరాలు వ్రాస్తూ వివాహంయొక్క ఆవశ్యకతని నిరూపిస్తూ వ్రాస్తారు. ఆ వుత్తరాలు చదూకొని నవ్వుకొంటాడు రామరాజు.

రామరాజు గదిలోస్టీలు కారియర్ రెండు అరిటాకులూ వున్నాయి. సాయంకాలం ఏడింటికీ కారియర్ తెచ్చి గదిలోపెట్టి వెళ్ళిపోతుంది పనిపిల్ల తాయమ్మ. దగ్గరున్న గొల్లగూడెంలోవుండే గొల్లపిల్ల. తాయమ్మకి పద్దెనిమిదేళ్ళు వుంటాయి. చిక్కని నలుపురంగులో చక్కని బింకమైన అవయవ సౌష్టవంతో వుంటుంది తాయమ్మ. రామరాజు అప్పుడప్పుడూ తాయమ్మతో కూడా సరదాగా కాలక్షేపం చేస్తూవుంటాడు. తాయమ్మ భర్తకి రెండుగేదెలూ, నాలుగయిదు గొర్రెలూ వున్నాయి. తాయమ్మకి రెండేళ్ళ కూతురుకూడా వుంది. దగ్గరగా వుంటంవించి తాయమ్మకి పనిలేనప్పుడల్లా రాజు ఇంటివెంపు వస్తూ ఉంటుంది.

"మీకు కారియర్ వున్నట్లుంది! భోజనం చేసేయండి. చల్లారిపోతుంది అనవసరంగా!" అంది నాగమణి. రాజు గదిలోనికి వెళ్ళాడు. ఎలక్ట్రిక్ దీపం కాంతిలో ఇస్త్రీ బట్టలలో

రాజు నలగని పువ్వులావున్నాడు. రాజుబట్టలు మార్చుకుని, బాత్ రూంలోకి వెళ్ళి కాళ్లూ చేతులూ, ముఖం కడుక్కుని వచ్చితువ్వాలుతో అద్దంముందునించుని తుడుచుకొంటూంటే చేతులో ఎవ్వర్ సిల్వర్ పళ్లెం పట్టుకుని, నించున్న నాగమణి కన్పించింది. వెనుతిరిగి -

"ఏమండీ ?" అన్నాడు.

"ఏం లేదు. కొద్దిగా ఫలహారం తెచ్చాను. తీసుకోండి !" అన్నది.

"ఇంకా భోజనం చెయ్యాలికదండీ !" అన్నాడు మొగమాటపడుతూ.

"ఎంతోలేదు కొద్దిగా ఇచ్చాను, తీసుకోండి ! ఈ రాత్రిపూటా ఈ ఊళ్ళో తెలియనిచోట్ల నానా అగచాట్లూ పడకుండగా దేముడల్లే కనిపించారు. మీకు నేనెల్లా కృతజ్ఞత చూపగలనో తెలీటంలేదు నాకు !" అంది నాగమణి.

రాజు మణికేసి చూస్తూ "దానిదేముంది ! నాకు చేతయిన సాయం చేస్తాను." అంటూ నవ్వాడు.

"మీరు భోజనం ఎక్కడ చేస్తారు ?" అంది.

"ఎక్కడో అక్కడ ! ఇక్కడే తింటాను" అన్నాడు.

"పదండి ! నా గది ఖాళీగా వుంది కదా ! అక్కడ చేద్దురుకాని ! ఈ గది పడకగదిలా వుంది ఇక్కడ మళ్ళీ అంటు చేయుటమెందుకు ?" అంది మణి.

"నా కలాంటి పట్టింపులు లేవు ! ఎక్కడో అక్కడ విస్తరి వేసుకుని తింటాను. కాస్సేపు పోయింతర్వాత పని పిల్లది వస్తుంది. అంతా బాగుచేసి పోతుంది" అన్నాడు.

"అయితే హాలులో వేస్తానుపదండి!" అంది. గుమ్మానికీవల నీళ్ళుజల్లి శుభ్రంచేసి, అరిటాకు పరిచింది.

"నేను వడ్డించనా! మీకు మొగమాట మెక్కువలాగుంది!" అంది.

"వడ్డించండి!" అన్నాడు.

తన మరచెంబుతో రాజు పడక గదిలోనున్న కూజాలోంచి నీళ్ళువంపి తెచ్చి, ప్రక్కగా పెట్టింది. నాగమణి పదార్థాలన్ని ఒక్కటొక్కటే, అడుగుతూ చక్కగా ఎత్తి ఎత్తివేసింది. నాగమణి తనతో కూడా తెచ్చుకున్న ఫలహారాలు, జంతికలు, బెల్లంపాకంపట్టిన వేరుశనగపప్పు వుండలు, చేగోడీలు, రెండు రెండు వేసింది. రాజు కారియర్‌లో సగం అన్నంకూడా తినలేకపోయాడు. తనచేత బ్రతిమాలించుకోకుండా భయపెట్టించికోకుండా నాగమణి ఇంత చనువుగా ఇంట్లో ఎప్పటినుంచో అలవాటు అయిన మనిషిలా ప్రవర్తించటం రాజుకి కొండెక్కినట్లు అనిపించింది. రాజు పరిచయాల్లోకి వచ్చినస్త్రీలు ముందు అతి వినయాలు సఖీ్చలాలూ ప్రదర్శించటం, తర్వాత ఏడ్పు రాగాలుపెట్టి పెద్ద మొత్తాలుగా డబ్బు గుంజుకుపోయి, పత్తాలేకుండగా పారిపోవటం! అంతే కాని ఇంట్లో బంధువులా పరిచయం అయిన అర్ధగంటలో మారిపోవటం రాజుకి, అంతాకొత్తగా వింతగావుంది, నాగమణి ప్రవర్తన.

"అయ్యో ! మీరు అసలు ఏమీ తినలేకపోయారు. కారియర్ సగానికిపైగా మిగిలిపోయింది. నేను వడ్డించటం మూలాన్నా ?" అంటూ నొచ్చుకుంది నాగమణి.

"రోజూ నేనంతే ! నాకేం బిడియంలేదు." అన్నాడు రాజు.

"రాజు బాబూ !" అంటూ బయట గదిలోంచి ఆడ గొంతు విన్పించింది.

"అదుగో తాయి వచ్చింది. ఆ కారియర్ అదీ కడిగేసి శుభ్రం చేస్తుంది. మీ రివలికి రండి !" అన్నాడు.

"కాస్త నిలుచుకోమనండి ! నేను కూడా భోజనం చేస్తాను !" అంది నాగమణి.

"అయితే ఆ కారియర్ కడిగేయించి మళ్ళీ తెప్పిస్తాను. 'తొమ్మిది' అయిపోతుంది. మళ్ళీ హోటళ్ళలో భోజనం అయిపోతుంది కూడా !" అన్నాడు రాజు.

"మళ్ళీ కొత్త కారియర్ తెప్పిస్తారా ! ఎందుకు ? అందులో నాకు కాక, నలుగురికి సరిపడ అన్నం ఉంది. ఇంత అన్నం వేస్టుచేయుట మెందుకనే నేను భోజనం చేద్దామను కున్నది !" అంది నాగమణి.

రాజుకి సంతోషంతో ఊపిరి తిరగటం లేదు. తనకి విస్తట్లో అన్నం వడ్డించటం తను తినగా మిగిలిన అన్నం తినటం. ఏమిటి ఈ స్త్రీ ? అతనికి అక్కచెల్లెళ్లు లేరు ! ఇంత అప్యాయతగా మాట్లాడిన స్త్రీలు, అతని జీవిత యానంలోతటస్థపడలేదు ఇంతవరకూ ? వదినగార్లు వున్నారు. వాళ్ళు తనకి వడ్డించి, తలుపుచాటుకు తప్పుకుని ఏమేమి

కావాలో కనుక్కునేవారు. కుశల ప్రశ్నలు, ఊరివిశేషాలు ఏమి కబుర్లుచెప్పినా తలుపుని చూస్తూ వినవలసిందే! తలుపుని చూస్తూనే అడగవలసిందే! రాజుకి పదిహేనేళ్ళు వచ్చింతర్వాత వదినల ముఖాలు ఎలా వుంటాయో చూచి ఎరుగడు. రాజుకి సంతోషంతో ఊపిరి తిరగటంలేదు. కాళ్ళు ఒకచోట నిలవక, గదిలోంచి హాలులోకి, హాలులోంచి గదిలోకి పచార్లు చేస్తున్నాడు. 'తాయి' మంచం మీద ప్రక్కదులిపి, పెట్లోంచి తెల్లని, ఇస్త్రీ దుప్పటి తీసివేసింది. తను తెచ్చిన, రెండు మిఠాయి కిళ్ళీలూ, టేబిలుమీద పెట్టింది. 'తాయి'కి రామరాజు ఇంటికి స్త్రీలు రావటం అలవాటే కనుక, మణిని చూసి ఆశ్చర్యపోలేదు. తాయి సాయంకాలాలు చక్కగా వేణ్ణీళ్ళు పోసుకుని ఉతికి ఆరవేసిన లంగా, వోణీ వేసుకుంటుంది. గట్టిగా బిగించివేసిన జడలో పూలు పెట్టుకుంటుంది. సాధారణంగా పూలులేని 'తాయి' జడ ఎవ్వరూచూడరు. కళ్ళనిండుగా, చింతాకు వెడల్పునకాటుక, ఎత్తయిన నుదుట, గుండ్రని తిలకం బొట్టూ కంఠానికి బిగుతుగా, ఎర్రని పగడాలదండా, ఒక విధమైన జానపద సౌందర్యంతో కలకలలాడుతూ వుంటుంది! ప్రక్కదులిపి వేసేక అద్దంలో తన ముఖం చూసుకుంటూ నించుంది తాయి.

నాగమణి భోజనంచేసి ఇవతలకివచ్చింది చీరచెంగుతో చేతులు తుడుచుకుంటూ.

"పనిపిల్లవుందా! వెళ్ళి కారియరు కడిగేయమనండి" అంది. తాయి కారియర్ చూసి మూతి ముడుచుకుంది.

"ఎంత ఆత్రకోట్టుతల్లి బాబూ! వణ్ణంలోకి సాంబా రన్నా మిగల్చలేదు!" అనుకొంటూ కారియరు బాత్ రూం లోకి తీసుకపోయింది. రాజు గదిలోకి వెళ్ళి తనొక కిళ్ళీ వేసు కుని, మణికికూడా ఒకటి ఇచ్చాడు.

"నాకు తాంబూలం అలవాటు లేదు!" అంది నాగ మణి.

ఆ కిళ్ళీకూడా తనే వేసుకున్నాడు. తాయమ్మ కారి యరు కడిగితెచ్చి, రాజుగదిలో పెట్టింది. వాళ్ళు అన్నాలు తిన్నచోట విస్తళ్ళుతీసి నీళ్లుజల్లి శుభ్రంగా తుడిచింది. హాలు లోకి వచ్చి-

"ఇంక నేవెళ్తా రాజుబాబూ!" అంది.

"ప్రొద్దుటే వచ్చెయ్యి!" అన్నాడురాజు. తాయమ్మ కళ్ళు నవ్వాయి.

"అలాగే లేండి!" అంటూ జడ భుజం మీద నించి ముందుకు వేసుకుని, త్రిప్పుకుంటూ వెళ్ళి పోయింది. రామ రాజు, నాగమణి వంటిగా మిగిలారు. నాగమణీ హాలులో నలు వెంపులా చూస్తో నించుంది. రాజుకి, నాగమణితీరును చూ స్తే, మోటుగా మాట్లాడబుద్ధికావటంలేదు. అలా అని కలిగిన ఈ అవకాశాన్ని, అనుభవించకుండా జారవిడుచు కోవటం, సుత రామూ ఇష్టం లేదు. ఏదోవిధంగా సంభాషణ ప్రారంభించాలి! క్రమ క్రమంగాతనమార్గంలోనికి నాగమణిని లాక్కు రావాలి! అంతవరకూ రాజు కంటిమీాదకు కూర్కు రాదు!

"చాలా పెద్దఇల్లు! ఇంత ఇంటిలో ఒక్కరూఎల్లా వుంటారండీ" అంది మణి.

"అమ్మయ్యో !" సంభాషణ దానంతటదే సాగి పోతుంది ఇంక.

"చెప్పానుగా ! నాకు ఏకాంతవాసం ఇష్టమని ?" అన్నాడు రాజు నర్మగర్భంగా.

"అనవసరంగా నలభయి రూపాయిల ఇల్లు వేస్తు కావటంలేదూ ! ఎంతలేదన్నా కరెంటుకి అయిదారు రూపాయిలు అవుతాయి ! ఏమంటారు ?" అంది మణి.

"పది పదిహేను రూపాయిల్లో వచ్చే ఇరుకుగదుల్లో ఉక్కిరిబిక్కిరి అవుతూ నేను జీవితం గడపలేను స్మండీ ! విశాలంగా, హాయిగా, ఏకాంతంగా రేడియోలో సినిమా సంగీతం వింటూ ప్రశాంతంగా గడిపేస్తాను. నామీద ఆధార పడి బ్రతకాల్సిన బాదరాయణులు ఎవ్వరూ లేరు. నెలకి మూడువందలదాకా జీతం వస్తుంది. ఏ నెల జీతం ఆ నెల చుప్తాగా ఖర్చుచేసుకున్నా, ఏడాదికి రెండు మూడువేల రూపాయలదాకా పొలం శిస్తులవల్ల వచ్చి బాంకులో ప్రసవ వేదన పడుతూనే వున్నాయి ! వేసినన్నాళ్ళే వెండి కాగ డాలా జీవితాన్ని ఆనందంగా అనుభవించక ఇరుకు మురికి జీవితాన్ని గడుపుతూ రూపాయిలన్నీ మూటలుగట్టి ఎవరి నెత్తికో ఎత్తాలన్న ఆకాంక్షనాకు లేదు!" అన్నాడు దర్పంగా రాజు. రాజు మాటలకి కాస్తసేపు మౌనం వహించిందిమణి.

"నేనొకటి ఆలోచిస్తున్నాను రాజుగారూ !" అంది.

"ఏమిటి ?" అన్నాడు రాజు.

"నేనెటూ ఈ వూళ్ళో వుండటానికి ఒక అద్దె ఇల్లు వెతుక్కోవలసి వుంది తెల్లారినాక. ఇంక చాంద్రాయణం

ప్రారంభించాలి. మీ ఇల్లు చాలా పెద్దదిగావుంది. నాకా, కావలసినది ఒక గది! నేను ఇంట్లోవున్నా లేనంత నిశబ్దంగానే వుండగలను. నాకు సంగీతం రాదు—కూనిరాగాలతో మీ ఏకాంతవాసం కాస్తయినా భంగపరచటానికి. మీరు 'బాతురూం'గా వాడుకుంటున్న ప్రక్కగదిలో ఒక పూట వండుకొని పడేసుకుంటాను. మీకు వీలయితే ఇప్పుడు నా సామాన్లు వేసుకున్న గది నా గదిగా వుంటుంది. బాతురూం ప్రక్కనున్న గది తలుపులు గట్టిగా తోస్తే పడిపోయేలా వున్నాయి. అంచేత రాత్రుళ్ళు గిన్నె, చెంబూ, నా సామాను పున్నిచ్చుకున్న గదిలో పడేసుకుంటాను. ఉదయం తొమ్మిదింటికి స్కూలుకుపోతే, తిరిగి సాయంకాలం అయిదు గంటలదాకా రాను. కరెంటుబిల్లు అంటారా—మీరెంత ఇమ్మంటే అంత ఇస్తాను. బయట ఎక్కడికి వెళ్ళినా, ఇరవై రూపాయ లియ్యందే ఈ మాత్రం ఇల్లు దొరకదు కదా! ఈ ఇల్లు విశాలంగా వుంది. మీరా వంటరి మనుష్యులు. ఏమంటారు?" అంది మణి.

ఏమంటాడు రాజు! రాజు బుర్ర పనిచెయ్యటం మానేసింది. శరీరం అంతా పన్నీటిలో స్నానంచేసినంత మధురిమ అలముకొనిపోతోంది.

"మీ ఇష్టం! కాని, నాకోసం అప్పుడప్పుడు నా స్నేహితులు వస్తారు. వాళ్ళు మిమ్మల్ని ఏదయినా కొంటె మాటలు అంటారేమో! దానికి మీరు మనసు కష్టపెట్టుకో కూడదు మరి!" పెద్దమనిషిలా అన్నాడు రాజు.

"ఆ! కుగ్రముఖాలు ఏదో అనుకుంటారు. అంత మాత్రానికే బెదిరిపోనులెండి." ఆరిందాలా అంది నాగమణి.

"అయితే ఫర్వాలేదు. చూడండి! మీరేదో చిన్న స్కూల్లో టీచరుగా వర్కు చేస్తోన్నారు. మీకు వచ్చే జీతం చాలా తక్కువ అనుకుంటాను. అందులో నాకు ఇరవయి రూపాయలు ఇచ్చేస్తే మీకు మిగిలేది ఇంకా తక్కువ అవుతుంది. అంచేత మీరు నాకు ఇంటద్దెక్రింద ఏమీ ఇవ్వనక్కర్లేదు. మరేమీ అనుకోకండి. ఏదో నా చేతనయిన సాయం నాకు చేద్దామని అనిపించింది" అన్నాడు.

"నేనేమీ అనుకోను! ఇలాంటి ఉదారం మాకూ అలవాటేలెండి! మా వూళ్ళో మాకు పెంకుటిల్లుకాక, తాటాకుల ఇల్లు కూడా వుంది. ఆ ఇల్లు వూరికే వుండటం ఎందుకని కొత్తగా పెట్టిన ఎలిమెంటరీ స్కూలుకు ఇచ్చేసారు మా నాన్న!

"పల్లెటూళ్ళల్లో అద్దెలు ఇచ్చేదెవ్వరు? అందరూ వుద్యోగాలవంకని పట్టణాలకి ఎగబ్రాకుతోంటిరి! ఖాళీగా పడివున్న కొంపల్లో, దీపంపెడితే చాల్నని అనుకుంటూ వూరికేనే వుణ్నిస్తారు" అంది మణి.

"మీ నాన్నగారు పల్లెటూళ్ళో ఏంచేస్తున్నారు?" అన్నాడు రాజు.

"మాకు స్వంతపొలం ఏమీ లేదు. ఎవరిదో నాలుగెకరాలు కౌలుకి తీసుకున్నారు నాన్న. నాపైన ముగ్గురు అక్కలున్నారు! వాళ్ళకీ పెళ్ళిళ్ళు అయినాయి. నాతర్వాత ఇద్దరు చెల్లెళ్ళూ, ఇద్దరు తమ్ముళ్ళూ వున్నారు. నేను యస్.

యస్. యల్. సి. పాసయ్యాను. సెకండరీగ్రేడ్ ట్రయినింగ్ అయినాను. ఇక్కడే మొదటిసారిగా ఉద్యోగం వచ్చింది" అన్నది నాగమణి.

"అన్నట్లు ఏ స్కూల్లో మీరు వర్క్‌చేయ బోయేదీ" అన్నాడు రామరాజు.

"రాజంపేటలోట! శివకామేశ్వరీ గరల్స్ మిడిల్ స్కూలట!" అన్నది నాగమణి.

"రాజంపేటా! అబ్బో- ఆ కొసానవుంది! మన జనార్దనంగాడి ఇల్లు అక్కడే! మైలూ మైలున్నరదాకా వుంటుంది! అంతదూరం మీరు రోజూ వెళ్ళిరాగలరా! రిక్షాలయితే బోలెడు డబ్బు అడుగుతారు" అన్నాడు.

"ఫరవాలేదు. నేను రోజూ నాలుగుమైళ్ళు నడిచి, ప్రక్కవూళ్ళో స్కూల్‌కి వెళ్లేదాన్ని! నాకు నడక అలవాటే" అంది.

"అయితేఫరవాలేదు. మీకుస్కూలుకి దగ్గరగా మకాం కావాలంటే జనార్దనం చూసిపెడతాడు ఇల్లు!" అన్నాడు.

"అక్కర్లే దంటున్నాగా! నేను వుండటంవల్ల మీకేం ఇబ్బంది కలుగనీయనులెండి!" అంటూ తన గది లోనికివెళ్ళి, బెడ్డింగు విప్పి పక్క సర్దుకోసాగింది. రాజు వెనకాతలవెళ్ళి గుమ్మంపై కమ్మి పట్టుకుని నించున్నాడు. మణి ప్రతి కదలికనూ అత్యంత శ్రద్ధాసక్తులతో పరిశీలించుతున్నాడు. నాగమణి లైటార్పి పడుకోబోతూ రాజుని చూసి లేచి—

"ఏమిటి నిలబడ్డారు ? ఇంకా నిద్ర రావటంలేదా ?" అంది.

"ఏం లేదు, ఏం లేదు. మీరేలా సర్దుతున్నారో చూస్తున్నాను" అన్నాడు.

"అదా నాకేం వుంది సర్దుకోటానికి ? వంటసామాన్లున్నాయి. రేపుదయం సర్దుకొంటాను. గుడ్ నైట్ !" అంది.

"గుడ్ నైట్ !" అంటూ వెనుతిరిగాడు రాజు. రాజు తన గదిలోనికి చేరుకునేలోగా, తన గది తలుపు నెమ్మదిగా చప్పుడు కాకుండా వేసి గడియపెట్టి వచ్చి పడుకొంది నాగమణి నడుం వాల్చీవాల్చకుండానే అలసిన ఆమెకన్నుల మీదకి నిద్రాదేవి వచ్చి కూర్చుంది. రాజు వచ్చి తన మంచంమీద కూర్చున్నాడు. కళ్ళు మండుతున్నాయి. ఎంత నిర్భీతిగా పడుకుంది మణి ! ప్రతి స్త్రీలూ ఇంత కలిసికట్టుగా వుండరెంచేత ! పలకరిస్తేనే చాలు సిగ్గుతో ముడుచుకుపోతారు ! భయంతో వణకిపోతారు ! ఆ భయాలూ, సిగ్గులూ చూస్తే చేతుల్లోకి తీసుకునేదాకా వదలబుద్ధవదు ! మణి తీరు తా నెరుగున్న స్త్రీలకంటె విభిన్నంగావుంది ! తనవల్ల పెద్దప్రమాదం ఏమీ జరగదన్నంత నమ్మకం ఆమెకి ఎందుకు కలిగింది ? కళ్ళు వాల్చేయటం, నవ్వులని బిగించటం, పమిటచెంగులు సర్దుకోవటం—ఈ లక్షణాలేమీ లేవు ఈమెలో ! ఛత్ ! పుట్టి జడి విధవనయిపోయాను ఇవ్వాళ ! ఆమె ఏదో ప్రత్యేకపు తరహా వ్యక్తి అని నాకు నేనే తలుస్తున్నాను. వెళ్ళి ఈ

మట్టున ఆ మెని గట్టిగా నా హృదయానికి హత్తుకుంటే ఏం చేస్తుంది ? ఇష్టంవున్నా, లేకపోయినా కాస్సేపు గింజుకు నయినా లొంగిపోక తప్పదు. లొంగిపోయినాక—

"మీరూ ఇల్లాంటి వారేనా ?" అంటుంది. అంటే ఏం ? నేను మామూలు మనిషినే ! నాకు, నాకు లేనిపోని మర్యాద ముసుగు నువ్వే. వూహించుకున్నావు! అనేస్తాను.

"కాదు ! మామూలు మనిషికారు ! పశువుతో సమానం మీరు !" అంటుంది ఏడుస్తూ. అరే ! మణి ఏడవటం ఎందుకు? ఏడవకేం చేస్తుంది! మర్యాదరామన్నలా నీడకి పిలిచి, ఆమె సర్వస్వం కొల్లగొట్టితే, ఆమె ఏడవక ఏం చేస్తుంది ! తప్పు ! ఆమెని ఏడిపించకూడదు. ఆమె నమ్మకాన్ని వమ్ము చేయకూడదు.

"ఛత్ ! ఏమయింది నాకివ్వాళ ! చేతుల్లో వున్న ఫలితాన్ని అనుభవించకుండా ఇన్ని వెధవాలోచను లడ్డు పడుతున్నానేమిటి ! మును పెప్పుడన్నా ఇల్లా జరిగిందా ! ఎంచేత నేను అశక్తుణ్ణి అవుతున్నాను ? ఇంక జాగుచేసే కొద్దీ ఇంకా పాడు ఆలోచన్లు ముసురుకుంటున్నాయి ! వెంటనే వెళ్ళి మణిని చేతుల్లోనికి తీసుకుని, గాఢంగా ఒక్క సారి హృదయానికి హత్తుకొని, ఆ లేత చెక్కిళ్ళని తనివితీరా ముద్దుపెట్టుకుంటే-తర్వాత-తర్వాత...అంతా మామూలే అయిపోతుంది ! దృఢ నిశ్చయం చేసుకుని గబగబా మణిగది వెంపు నడిచాడు. నుదుటికి తలుపు గట్టిగా తగిలేదాకా మణి తలుపు వేసుకుందని రామరాజుకి తెలీలేదు.

"అబ్బ! చచ్చేట్లు బొప్పికట్టింది! తలుపు వేసుకుం దన్నమాట! జాగ్రత్తకలదే! అయినా ఎక్కడికి పోతుంది? వంటింటి కుందేలు అయిపోయింది. ఇవ్వాళ కాకపోతే రేపు!" హాలులో అర్ధరాత్రిదాకా ఇటూ అటూ పచార్లు చేస్తూ యమయాతనపడ్డాడు నిద్రరాక రాజు!

తెల్లవారి 'తాయి' వచ్చేసరికి నాగమణి లేచి, నూతి దగ్గర స్నానంచేసి, బట్టలుతికి ఆరవేసుకుంది. తాయమ్మ నాగమణినిచూసి విస్మయపడింది. రాజుకోసం వచ్చిన స్త్రీలు తూర్పు తెల్లవారుతోనే ఇంత పరిశుభ్రంగా స్నానం అదీ చేసి, 'ఉత్తమా ఇల్లాలు'లా వుంటం అది ఎరుగదు. తాయి వచ్చి లేపితేకాని ఆ స్త్రీలు లేచేవారుకాదు. వాళ్ళకి బాల్చీలో నీళ్ళు తోడిపెట్టి, టూత్ పేస్టూ, బ్రష్షూ, సోపూ, టవలూ, "బాత్ రూం"లో పెట్టి, ఫ్లాస్కు పుచ్చుకుని హోటలుకి పరిగెత్తి కాఫీ ఫలహారాలు తెచ్చేది. వాళ్ళు నిక్కి నీలుగుతూ, ముఖప్రక్షాళనం అయిందనిపించి, ముఖ మన్నా సరిగ్గా తుడుచుకోకుండా తాయమ్మ తెచ్చిన కాఫీ టిఫెన్లూ ఊదేసేవారు. దానికిపావలో, అర్ధో బక్షీసు డబ్బులు పడేసి, తమదారిన తాము పోయేవారు! నాగమణి అలా కాదు. చక్కగా తలదువ్వుకుంది! ఆ చిన్నజడలో, చిన్న మునుగోరింట పూలదండ పెట్టుకుంది! నుదుట దోసగింజంత బొట్టు పెట్టుకుంది! ఆకుపచ్చ, ఎరుపు, కలనేతనేసిన ఎర్రంచుచీర కట్టుకుంది. "బాత్ రూం" ప్రక్కనున్న గది శుభ్రంగా దులిపి కడిగి ముగ్గుపెట్టివుంది. అందులోవున్న అల

మారులో, గోనెసంచీ మూటలోంచి, రకరకాల సైజుల డబ్బాలూ, సీసాలూ, సర్దుతూ కన్పించింది నాగమణి.

"కాఫీకి వెళ్ళనా అమ్మాయిగారూ ?" అంది తాయి.

"ఎవరికీ ?" అంది మణి.

"మీకేనండీ ! రాజుబాబు ఒటేల్లో తాగుతారు !" అంది తాయి.

"నాకా ! నాకు కాఫీ అలవాటులేదే పిల్లా ! ముందు వీధి అరుగులుశుభ్రంగా కడిగి గుమ్మంవూడ్చి ముగ్గువెయ్యి ! ఇవ్వాళ మంగళవారంకూడానూ !" అంది నాగమణి.

"కిరాయి"కి వచ్చిన బాపతు కాదల్లే వుంది ! రాజు బాబుకి దూరంబంధువు ఎవరో అయివుంటుంది ! ఈ శుభ్రం అదీ ఆ "సానిపాప"లకి రమ్మంటే వస్తుందీ ! ఎంతసేపూ పాతగోడలకి వెల్లవేసినట్లు ముఖాలకి పౌడర్లు, రంగులూ పూసుకుని తిరగమంటే తిరుగుతారు. గుంటముండలు ! అను కుంటూ తాయమ్మ అరుగులు కడిగి గుమ్మం వూడ్చి కళ్లాపి చల్లి, చక్కగా తీర్చిదిద్ది ముగ్గులు పెట్టింది లోపలికి వచ్చి 'బాత్ రూం'లోని కుండలు కడిగి, నీళ్ళు చేది, తెచ్చిపోసి ఇల్లంతా శుభ్రంగా వూడ్చింది. నాగమణి వచ్చి "పిల్లా నీ పేరేమిటి ?" అంది

"తాయారు అండి" అంది.

"రాజుబాబు నీకేమిస్తారు ?" అని అడిగింది.

"నెలకి అయిదు రూపాయలు ఇస్తారమ్మా !" అంది.

"నేను కూడా రెండు రూపాయి లిస్తాను. ఉదయం పూట నా గిన్నెలు కూడా తోమి పెట్టుతూండు!" అంది నాగమణి. తాయారు కళ్ళువిప్పాకుని చూసి-

"మీరు రాజుబాబు చుట్టపోరు కారాండీ" అంది.

"ఆయనగారిదే కులమోకూడా నాకు తెలీదు! నేనీ వూళ్ళో పంతులమ్మ ఉద్యోగానికి వచ్చేను. ఈ ఇంట్లో అద్దెకి వచ్చాను" అంది మణి.

"రాజుబాబు బ్రాహ్మలే అయివుంటారులెండి! మెళ్ళో జంజెం వున్నది." అంది తాయారు.

"సర్లె! ఆయన దే కులం అయితే నాకేం? నీవు మటుకు నాకు కూడా పనిచేసిపోతూండు" అంది నాగమణి.

"అల్లాగేనండి! మీరింతగా చెప్పాల్నా! అయితే నాకు తెలీక అడుగుతాను. మీరూ, రాజుబాబూ ఒక బళ్ళో చదూకూన్నారామ్మా!" అంది తాయి.

"అవు కానీ, ఇక్కడికి బొగ్గుల దుకాణం దగ్గరా, దూరమా!" అంది నాగమణి.

"అంతదూరం కాదులెండి!" అంది తాయి.

"అయితే ఒక రూపాయి బొగ్గులు వేయించుకొనిరా! మార్కెటుకి వెళ్ళి, నాలుగు అరటికాయలు పట్టుకొనిరా" అని డబ్బులు ఇచ్చింది నాగమణి. తాయి బజారుకి వెళ్ళింది.

రాత్రి తెల్లవార్లూ నిద్రరాక కొట్టుకలాడి తెల్లవారు ఝామున వెర్రినిద్ర కమ్ముకుపోగా బాగా ఝాము పొద్దెక్కాక లేచాడు రామరాజు. రాత్రి నిద్రలేమి కారణంగా కళ్ళు బాగా ఎర్రబారి ఉబ్బివున్నయ్! అతను లేచి హాలు

లోకి వచ్చేసరికి, ఎక్కడా చెత్తా చెదారమూ లేకుండగా శుభ్రంగా ఊడ్చి వుంది. ముఖం కడుక్కోడానికి వీధి అరుగు మీదకు వెళ్ళేసరికి కలకల్లాడుతూ పచ్చగా జల్లిన కళ్ళాపు మీద తెల్లనిముగ్గు మురిపించింది. ముఖం కడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటూ మణివున్న గది దగ్గరకు వచ్చాడు. మణి గుమ్మంవేపు వీపుపెట్టి కూర్చొని దోసకాయ సన్నగా ముక్కలు తరుగుతోంది. ఒక కుంపటిమీద, గిన్నెలో అన్నం, ఇంకో కుంపటిమీద గిన్నెలో పప్పూ తుకతుక లాడుతూ, కమ్మని వాసన వస్తూంది. తలుపుల్లేని అల మారలో చిన్న చిన్న జాడీలూ, సీసాలూ, డబ్బాలూ వర సగా అమర్చి వున్నాయి. ఒక వెంపు మూలగా గోడ క్రిందుగా మేకుకొట్టి 'గోవూ, గోపాల క్రిష్ణుడూ' చిత్రించి వున్న కాలండరు వ్రేలాడగట్టి వుంది. గోడకి దిగువన చిన్న బెజ్జంలో రెండు వూదొత్తులు వెలిగించబడి సన్నని సువాసన గది అంతటా వ్యాపించుతోంది. నిశ్శబ్దంగా పొందిగ్గా కూర్చుని తనపని తాను, ఏకాగ్రచిత్తంతో చేసుకుంటూన్న నాగమణిని చూసేసరికి ఎక్కడలేని పూజ్యభావమూ కలిగింది రాజుకి. నిన్నటిదాకా దుమ్మూ ధూళీ పేరుకుపోయిన ఆ గది ఆ అమ్మాయి చేతిస్పర్శతో ఈ రోజు ఒక పవిత్ర దేవాలయపు రూపు సంతరించుకోవటం చూస్తే, రాజుకి స్త్రీలలో ఒక 'దైవత్వమయిన సౌందర్య దృష్టి' వుంటుం దనిపించింది. ఆ నిర్మల కమనీయమూర్తిని వివశుడై చూస్తూ, అల్లానే నిలబడిపోయేడు రామరాజు.

క్షణం గడిచాక, ఏవో చూపులవేడి, తన వీపుకి గుచ్చుకున్న స్ఫురణరాగా వెనుతిరిగి చూసింది.

"లేచారా! ముఖం కడుక్కున్నారా?" ఎంతో సహజంగా ప్రశ్నించింది. రాజుకి సిగ్గువేసింది. రాత్రి అంతా ఆమె గురించి ఆలోచించిన ఆలోచనలూ, అవి అన్నీ ఆమెకి తెలిసిపోయినట్లు బాధపడ్డాడు రాజు! తెల్లవారి ఒకే పరిసరాల్లో ఎన్నాళ్ళనించో కలిసిమెలిసి మసలుతూన్న ఆత్మీయుణ్ని పలకరించినట్లు పలకరించింది మణి.

ఏమి మాట్లాడాలో తెలీక —

"తాయి వెళ్ళిపోయిందా?" అన్నాడు.

"లేదు. ఒక అణా పెరుగు పోయించుకుని రమ్మని పంపాను. కాఫీకి ఆలస్యం అయిపోతూందా?" అంది మణి.

"లేదు! హోటలుకిపోయి ఏకంగా ఫలహారంకూడా చేసి ఆఫీసుకి పోతాను. మీరు త్వరగా తెములండి! వంటా, గింటా అంటూ కూర్చుంటే, పది అయిపోతుంది?" అంటూ, బాత్‌రూం వైపు వెళ్ళాడు రాజు. వెళ్ళినవాడు మళ్ళీ వచ్చి, "అన్నట్లు మీరు కాఫీ తీసుకున్నారా?" అన్నాడు.

"నాకు కాఫీలూ, టీలూ అలవాటు లేవు! మా ఇంటి దగ్గర 'తరవాణి' అన్నం వుండేది. అందరితోపాటు అదే తినేదాన్ని!

"ఇక్కడ ఒక్కదానికి ఏం తరవాణి పెట్టుకుంటాను? అంచేత పెందరాళే వండుకుని తినేస్తాను. అన్నట్లు సాయంకాలం మీరు నా దగ్గరే భోజనం చేయాలి! కారియర్

వద్దని చెప్పేస్తాను. ఈ పూట నాకుమటుకే వండుకున్నాను"
అంది మణి.

"మీకు కాఫీ అలవాటు లేదా! ఈ కాలంలో స్వతం
త్రంగా ఆర్జించుకుంటున్న స్త్రీలు ఇంత నిరాడంబరంగా జీవిం
చటం నేను ఎక్కడా చూడలేదు! మా ఆఫీసులో స్టెనో
వుంది. ఆమెగారు రోజుకి ఆరుసార్లు 'బోర్న్‌విటాలు' తెప్పించు
కుంటుంది. ఆమె హేండ్‌బాగ్‌లో 'సారిడన్'లూ,
'ఆస్ప్రో'లూ లేకుండా ఎప్పుడూ వుండవు! ఆమె హోటలు
బిల్లు ఎంతలేదన్నా నెలకి నలభయి-యాభయి రూపాయిల
దాకా అవుతూ వుంటుంది!" అన్నాడు రాజు.

"హోటలు బిల్లు అంత అయిందంటే, అంతకి రెట్టింపు
డాక్టరు బిల్లూ అవుతుందన్నమాటే! నేను ఆమెగారంత,
లగ్జరీగా జీవించటానికి విటమిన్లు చాలవులెండి" అంది మణి.

రాజు స్నానంచేసి బట్టలు వేసుకునేసరికి మణి భోజనం
చేసి రెడీ అయ్యింది. తినగా మిగిలిన అన్నం ఒక పళ్లెంలో
పెట్టి, గిన్నె బోర్లించి, తలుపుకి గొళ్ళెంపెట్టి, తన గది
లోంచి పుస్తకాలూ, జాయినింగు ఆర్డరు కాగితం పుచ్చు
కుని హాలులోనికి వచ్చి నించుంది. రాజు ట్రిమ్‌గా ముస్తా
బయ్యాడు. రాజు తన గదికి తాళం వేస్తోంటే —

"బాబూ, కారియర్ ఇవతలడెయ్యండి!" అంటూ
తాయి వచ్చింది.

"చప్పున తీసుకో" అన్నాడు రాజు.

"నేనొక పొరపాటు చేసాను" అంది మణి.

ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా కనుబొమ్మలు పైకెత్తి చూసాడు.

"ఇల్లు అద్దెకి తీసుకోవాలనుకున్నానా? ఒక్క తాళం కూడా తెచ్చుకోలేదు! ఈ పూటకి మీ తాళం ఇస్తారా? నా గదికి వేసుకుంటాను" అంది.

"తీసుకోండి! సాయంకాలం ఒక తాళం కొందాం లెండి!" అన్నాడు.

మణి తాళం తీసుకుని గదికి తాళంవేసి, తాళంచెవి చేతిరుమాల్లుకి కట్టుకుని వచ్చింది.

"మీకు ఎల్లాగయినా జాగ్రత్త ఎక్కువ!" నడుస్తో అన్నాడు రాజు.

"జాగ్రత్తగా వుండకపోతే ఎలా? ఆ గదిలో నాకు నెల్లాళ్ళకి సరిపడా గ్రాసం వుంది. పనివాళ్ళని నమ్మలేం స్మండీ! వాళ్ళకి ఇల్లు అప్పగిస్తే ఆ సామాన్లు వారం రోజుల్లో వూడేస్తారు! ఈ కరువురోజుల్లో ఏ సామాను అయి పోయినా కొనుక్కోవటం కష్టం!" అంది.

ఇద్దరూ రోడ్డుమలుపు తిరిగారు. జనార్దనం వాళ్ళకి ఎదురువస్తూనే —

"హల్లో రాజూ! ఏమిటి విశేషాలూ? ఏమండీ మణి గారూ? రాత్రి బాగా నిద్ర పట్టిందా?" అంటూ కొంటెగా నవ్వుతూ పలకరించాడు. రాజు ముఖం ముడుచుకున్నాడు. మణి మటుకు తెల్లకలువలా నవ్వుతూ—

"గుండెలమీద చేతులు వేసుకుని నిద్రపోయానండీ హాయిగా ! నేను ఈ వూరు రాగానే, మీ మిత్రులు తటస్థ పడటం నా అదృష్టం అనుకోండి ! ఆయన ఇచ్చిన చనువు కొద్దీ ఈ వూళ్ళో వున్నన్నాళ్లూ ఆయన ఇంట్లోనే మకాం పెట్టేయదల్చుకున్నాను కూడా ! ఇంత చప్పున నాకు ఇల్లు దొరుకుతుంది అనుకోలేదు." అంది.

"ఆహా ! అల్లాగా ! అయితే రాజు ఇంట్లో భాగ స్వాములై పోయారన్నమాట ! యూ ఆర్ లక్కీ !" అన్నాడు జనార్దనం. రాజు ముఖం పొగాకుకాడలా ముడు చుకుపోయింది. నాగమణిని స్టూలుదగ్గర విడిచిపెట్టాక—

"ఏరా భయ్యా ? తైరు 'రొంబ' కొట్టోంది ! పెళ్ళి కూడా చేసుకుంటానని వాగ్దానం జేసావా ఏమిటి కొంప దీసి ?" అన్నాడు జనార్దనం.

"ఇష్టంవచ్చినట్లు మాట్లాడకురా ! మరీ నాలుకని అంత స్వేచ్ఛగా వదిలెయ్యటం అన్నివేళలా మంచిదికాదు!" కోపంగా అన్నాడు రాజు.

"ఏమయిందిరా నీకు? సరసం విరసం అయ్యిందేమిటి?" అన్నాడు జనార్దనం.

"నేనూ మనిషినేరా జనా ?" అన్నాడు ముఖం దీనంగా పెట్టి.

"అరె నువ్వు మనిషివి కావన్న దెవరు ? అసలు ఏం జరిగిందో చెప్పకూడదా ! ఇన్నాళ్ళనించీ, నీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న వాణ్ణికదా! నా చెవినో ముక్క వేయ కూడదురా !" అన్నాడు ఓదార్పుగా జనార్దనం.

"మరి కన్పించిన స్త్రీనల్లా, నేను అవమానించుతా నన్న వూహ నీ కెందుకు కలిగింది? నేను అందరిపట్లా అంత నీచంగా ప్రవర్తించుతా ననుకున్నావా?" అన్నాడు రాజు.

"ఇంతలో నీకింత జ్ఞానోదయం కలుగుతుందను కున్నాట్రా! మనం ఎప్పుడు అమ్మాయిలని తీసుకొచ్చినా అందుకేగదా పాపం! ఈ ఇల్లాలు ఏదో తన ఇబ్బందుల్ని బాగా వర్ణించి నీనించి బోలెడంత సానుభూతి లాగివుంటుంది. ఏదో మన పాత అలవాటుకొద్దీ అడిగాను కాని, నువ్వు మని షివి కావన్నానా? ఇంకనన్నా నీవు నిజంగా 'ఏకాంత ప్రియుడవైతే' సంతోషించే వాళ్ళల్లో నేనే మొదటి వాణ్నని జ్ఞాపకం వుంచుకో!" అన్నాడు జనార్దనం.

రాజు మాట్లాడలేదు. ఆఫీసులో అంతాకూడా, మూగగా నిర్వేదంగా తన పని తను చేసుకుంటూ కూర్చు న్నాడు. ఆఫీసు వదిలిం తర్వాత —

"ఏరా?" అంటూ కూడా వచ్చాడు జనార్దనం.

"మొత్తానికి భలే ఆవిడలే! సరిగ్గా ఇలాంటి ఆవిడ నీకు భార్యఅయితే, నీకు మునువున్న ఆడపిచ్చి అంతా నిమి షంలో వదిలించేస్తుంది! ఒకే కప్పుక్రింద పద్నాలుగు గంటలు నీతో గడిపికూడా నిన్ను దూరంగా మేనేజ్ చేయ గల్గిందీ అంటే, మై గాడ్! మణి నిజంగా దేవతయినా వుండాలి! కాకపోతే, దేవతలకి వికృతి స్వరూపమయినా అయివుండాలి!"

"మరీ అంత అశ్లీలంగా మాట్లాడకు భాయి!" అన్నాడు రాజు.

"పడ్తావులే ప్రేమలో!" అన్నాడు జనార్దనం.

"నీ ముఖం !" విసుగ్గా అన్నాడు.

"మరీ అంత తేలిగ్గా అనెయ్యకు భాయి ! నీకు ఆమె అంటే, భయమూ, భక్తీ కుదిరాయని నాకు తెలుస్తోనే వుంది. మీ అన్నయ్యలకి వ్రాసేస్తాను. సలక్షణంగా మూడు ముళ్ళూ వేసి ఒకింటివాడవై నన్ను అప్పుడప్పుడూ భోజనానికి పిలుస్తూండు చాలున్న !" అన్నాడు.

"నువ్వేం వ్రాయక్కర్లేదు" అన్నాడు రాజు.

"అరే అప్పుడే వ్రాశేసావా ఎంత సూక్ష్మబుద్ధివిరా" అన్నాడు.

"ఆఫీసు కొస్తూనే వ్రాసాను ! నిజంగా ఎంచేతో నాకు నాగమణినిచూస్తే, చాలాఇదిగా వుంది. మునపటి జీవితం అంతా బురదలో కూరుకుపోయినట్లు అనిపించింది. ముందుగా నాకు నేనే ఆవిడని ఇలాంటి మాటలు ఆడి కష్టపెట్టలేను. పెద్దన్నయ్యకి వ్రాసాను. ఆయన రాగానే మణి వూరుకి పంపించి, వాళ్ళ నాన్నగారితో సంప్రతించమంటాను. పెద్దవాళ్ళద్వారా సంభావణలు జరిగితే బాగుంటుంది. ముందు, నాకు నేనే ఇలాంటి మాటలు మాట్లాడి ఆమెముందు నన్ను నేను హీనపరచుకోలేను" అన్నాడు రాజు.

"ఓర్నీ ! నాకు చెప్పకుండా ఇంత ఆలోచన దాచుకున్నావురా? చాలా సంతోషంరా !" అన్నాడు జనార్దనం. ఇద్దరూ ఇంటికి వచ్చారు. ఇంటిముందున్న ముగ్గూ అదీ చూడగానే—

"చూసావురా జనా! ఆమె చేతి స్పర్శతో ఇంటికి ఎంత కళ వచ్చిందో! సమర్థురాలైన స్త్రీ ఆవిడ!" అన్నాడు సంతోషంగా రాజు.

"అవును. అవును" అన్నాడు జనార్దనం. మణి ఇంట్లో హడావిడిగా తిరుగుతోంది. ఆ గదిలోంచి ఈ గదిలోకి, ఈ గదిలోంచి ఆ గదిలోకి తిరుగుతోంది.

"ఏమిటండి హడావిడి!" అన్నాడు జనార్దనం.

"వచ్చారా! మీ సంగతే అనుకుంటున్నాను. రాజు గారు ఈ పూట ఇక్కడే భోజనం చేస్తారు. మీరు కూడా భోజనానికి వుండండి!" అంది మణి.

"ఊరికే వచ్చే భోజనాన్ని నేను వదలుకోను లెండి! కాస్త కూరలూ అవీ దండిగా చేయండి! కందిపొడీ, ఆవకాయా తినీ తినీ జిహ్వ చచ్చిపోయింది.!" అన్నాడు.

"చలాకీగా మాట్లాడుతారు మీరు!" అంటూ మెచ్చుకుంది మణి.

"మీ రాజుకంటేనా?" అన్నాడు జనార్దనం.

"ఎలాగయినా మీరిద్దరూ చాలా సంస్కారవంతులు! ఈ రోజుల్లోకూడా స్త్రీని గౌరవంగా చూడకలిగే మీ సంస్కారం నిజంగా ఎంతో ఉన్నతమైనది! ఉద్యోగాలు చేసే స్త్రీలు ఇంటిలో, ఆఫీసుల్లో కూడా, ఎన్నో అవమానాలపాలు కావలసివస్తోంది. మీలాంటి సంస్కారవంతులు నూటికి పదిమంది వున్నా చాలును - స్త్రీలు ధైర్యంగా తమ పనులు తాము చేసుకోగలరు" అంది మణి.

"ఏమిటండోయ్! ఉపన్యాసం ఇచ్చేస్తున్నారు!" అంటూ రాజు బట్టలు మార్చుకొని హుషారుగా వచ్చేడు.

"నీ మంచితనాన్ని వేనోళ్ళ పొగడుతున్నారు మణి గారు!" అన్నాడు జనార్దనం.

"అదా! ఏదో మనుష్యులం! తోటి మనుష్యులకి కలిగినదానిలో ఆమాత్రం ఉపకారంచేస్తే ఏమయిపోతాం!" తేలిగ్గా అన్నాడు రాజు.

"అంతా మనుష్యులేనండీ! కాని కొంతమంది మనుష్యులు, అవకాశం ఇచ్చిన అలుసు చూచుకొని, పశువుల కన్నాహీనంగా ప్రవర్తించటం నేను చాలాచోట్ల విన్నాను. విద్య, ధనం, బలంవున్న మీలాంటి యువకులు ఇంత సంస్కారం ఇంత ఉదారతా ప్రదర్శించటంచూస్తే ఇంకా మన దేశంలో ఏ మూలో మన ధార్మిక నైతిక సూత్రాలు తలెత్తే ఉన్నాయనిపించుతోంది! నిజంగా మీలాంటి సచ్ఛీలంగల యువకులే జాతీయ ఐక్యతని నిలబెట్టగలరని నా నమ్మకం!" వివశంగా అంది మణి.

రాజు గాఢంగా నిట్టూర్చాడు!

"మా రాజుగాడికి పది మణుగుల బంగారం టోపీ పెట్టేరు" అన్నాడుజనార్దనం. 'తాయమ్మ' చేతులో గుప్పెడు కరివేపాకుతో వచ్చింది.

వస్తూనే—

"రాజుబాబు, అనసూయమ్మగారు కనపడ్డారు. మీరు ఊళ్ళో వున్నారా అని అడిగారు" అంది.

"సరే! వెళ్ళు" గాభరాగా నసిగాడు రాజు. తాయి ముసి ముసిగా నవ్వుకొంటూ.-

"మణమ్మా! ఇదిగో కరేపాకు!" అంటూ గుమ్మంలో పడేసి వెళ్ళిపోయింది.

మణి చాలా వంట చేసింది. గెస్టులకోసం పెరుగు వడలు, పులిహోరా చేసింది. తనుచక్కగా స్నానంచేసి, శుభ్రమయిన చీర, జాకెట్టు ధరించింది. అరుగు మీదకు వచ్చి నించుంది. ఇంకో అరుగుమీద ఈజీచెయిర్స్ వేసుకుని, రాజు జనార్ధనం కూర్చున్నారు. ఇవ్వాళ వాళ్ళు పాత అలవాట్లు చాలా మార్చుకున్నారు. బస్సుస్టాండుకి కాలక్షేపంకోసం వెళ్ళటం మానివేసారు. మణి అనే ఉత్తమ స్నేహితురాలితో కబుర్లు చెప్పుకుంటే చాలున్న వాళ్ళకి కావల్సినంత కాలక్షేపం!

"కూర్చున్నారేం? ఇవ్వాళ బస్టాండుకి వెళ్ళరా?" నవ్వుతూ అంది మణి.

"నిన్న అంటే మీరు వస్తారని వచ్చాం. ఇవ్వాళ ఎందుకు వెళతాం?" అన్నాడు జనార్ధనం.

"నేను వస్తానని ఎలా తెలుసు?" అంది.

"మా రాజుగాడికి కల వచ్చిందిట. అందులో 'ఒంటరిగా ఒకఅమ్మాయి వస్తుంది, ఆ అమ్మాయికి ఆతిథ్యం ఇవ్వాల్సిన పూచీ నీదే!' అని ఒక దేముడు చెప్పాడుట. అందుకని వానఅయినా చలిఅయినా మీరు వచ్చేదాక కాపు వేసాడు!" అన్నాడు.

"భలేగా మాట్లాడుతారు !" అంది నవ్వుతూ. రాజు మణికేసి చూస్తూ మాట్లాడటంలేదు. ఆమె నిల్చున్న తీరు, మాట్లాడుతూన్న తీరు అంతా ఆతనికి ఎంతో ముచ్చటగా వుంది. ఈ మణి తనకి అపురూపంగా దొరికిన బంగారు బొమ్మ ! ఈ బొమ్మని తను జాగ్రత్తగా తన హృదయ మందిరంలో ప్రతిష్ట చేసుకున్నాడు. ఇంక కొద్దిరోజుల్లో ఈ మణీ తానూ చేయీ, చేయీ కలుపుకుని, నూతన జీవితం ప్రారంభిస్తారు !

"వివాహం" అనే పవిత్రబంధం యొక్క విలువ తనకి మణిని చూసేక కలిగింది. ! తాను మారిపోయేడు ! మణి దృష్టిలో తను ఉత్తమ సంస్కారి అయినాడు. బురదలోంచి కమలం ఉద్భవించినట్లుగా తనలోంచి, తన దుర్నడతలోంచి సంస్కార లక్షణాలు ప్రభవిల్లుతున్నాయి ! తను మనిషి ! మంచిమనిషి ! సంస్కారి ! ఉత్తమసంస్కారి ! పారవశ్యంగా కళ్ళు మూసుకున్నాడు రాజు.

విసురుగా 'రిక్షా' ఆగిన చప్పుడయింది ! అందులోంచి బక్కగా పొడుగ్గా దిగిన యువకుడు, బెడ్డింగు చేత్తో పుచ్చుకుని నిలబడ్డాడు.

"రండి. రండి. నిలబడ్డారేం ?" అంటూ మెట్లుదిగి అతని చేతిలోని బెడ్డింగుని పుచ్చుకుంది మణి.

"మీ స్కూలుకి వెళ్ళాను. మీ హెడ్‌మిస్ట్రెస్ 'బస్టాండ్‌కి వెళ్ళే దోవలో చివరి ఇంటిలో వున్నారట ?' అని చెప్పారు. ఇది అవునా కాదా ! అని ఆలోచిస్తున్నాను" అన్నాడు అతను.

"స్కూలుకి చాలాదూరం ! అయినా అద్దెలేకుండా ఇల్లు దొరికిందికదా అని ఇక్కడే వుందామనుకుంటున్నాను!' అంటూ అతన్ని లోపలికి తీసుకవెళ్ళింది. జనార్దనం ఆశ్చర్యంగా చూసేడు. రాజు కళ్ళు విప్పలేదు ! కలల్లో తేలుతున్నాడు. ఆ కలల్లో రాజూ మణి మేఘాలలో విహరిస్తూన్నట్లు చిత్రాలు కన్పడుతున్నాయి. అరగంట గడిచాక, మణీ అతనూ బయటకు వచ్చేరు.

"వీరే ప్రస్తుతం ఈ ఇంటి యజమాని రాజుగారు ! ఈయన వారి మిత్రులు సహోద్యోగి జనార్దనంగారు !" అంటూ పరిచయం చేసింది నాగమణి.

"నమస్కారం ! మణి అంతా చెప్పింది ! మీరు చూపిన ఉదారత మమ్మల్నెంతో ముగ్ధుణ్ని చేసిందండీ రాజుగారూ !" అన్నాడు అతను.

"ఆఁ ! దానికేముంది లేండీ !" తేలిగ్గా అన్నాడు రాజు.

"ఈ వూరికి ట్రాన్స్ఫరు చేయించుకునేసరికి నా తల ప్రాణం తోకకి వచ్చిందంటే నమ్మండి ! తిరిగీ తిరిగీ, ప్రాణం విసిగెత్తిపోయింది. ఈ అధికార్లు బాబూ మాలాంటి వాళ్ళ గోడు విన్పించుకోరు." అన్నాడు అతను.

"మీరేం చేస్తున్నారు ?" అన్నాడు రాజు.

"జె. పి. హైస్కూల్లో టీచరుగా వర్కు చేస్తున్నాను.

ఈ వూరు వేయమంటే ఎంత పుడుక్కుని చచ్చారను కున్నారు ?" అన్నాడు అతను.

"ఎందుకు మీరీ వూరు కోరుకున్నారు ? ఇక్కడి హైస్కూలు పిల్లలు రావణావెధవలు !" అన్నాడు జనార్దనం.

"ఏంచేయను చెప్పండి! తీరా 'మణి'కేమో, ఈఊళ్ళో, జాబ్ వచ్చిందాయె ! అంచేత, నేనూ ఈ ఊరే వద్దామను కున్నాను. ఈ ఊరేమో, మా ఇద్దరి ఊళ్ళకీకూడా, బాగా దగ్గిరగా వుంది. అయిదేసి అణాల బస్సుఛార్జిలతో ఇళ్ళకి పోయి రావొచ్చును. నాకూ తల్లితండ్రి అన్నలూ, చెల్లెళ్లూ అందరూ వున్నారు. అంచేత నానా గడ్డికరిచి, చచ్చి, చెడి, ఈ ఊరులో ఈ మేస్టారు గిరీ కుదుర్చుకున్నాను" అన్నాడు అతను. చీకటి పడింది. రోడ్డు దీపాలు వెలిగాయి !

"బాతాఖానీ వేసుకు కూర్చున్నారా ? పదండి భోజనాలకి !" అంటూ మణి వచ్చింది లోపల్నించి.

"ఇంతకీ అసలు విషయం చెప్పేరు కాదు ! మణిగారు మీ కేమి అవుతారన్నారు ?" అన్నాడు జనార్దనం.

"భలేవారే ! రామాయణం అంతావిని సీత రాముడు కేమవుతుంది ? అన్నారుట అల్లావుంది !

"మణికోసం కాకపోతే నేనీ ఊళ్లో వుద్యోగం కోసం పరుగులెత్తటం ఎందుకూ మీ పిచ్చిగానీ !" భళ్ళుమని నవ్వాడు అతను.

"అంటే ?" అన్నాడు రాజు అర్థం కానట్లు. అర్థం చేసుకుందుకు ఇష్టంకానట్లు వుంది రాజు ధోరణి.

"అంతేనా! మణి, నా భార్యండీ! నా భార్య! అహహా! భలే బ్రహ్మచారులే దొరికారు! పదండి భోజనాలకి!" అని మళ్ళీ పెద్దగా నవ్వాడు అతను. మణికూడా నవ్వింది నిండు చామంతిలా!

జనార్ధనం తెల్లబోయి రాజు ముఖంకేసి చూసాడు. రాజు కళ్ళు నిండుకుండలయిపోగా గబగబా, లోపలికి వెళ్ళి "బాత్ రూం"లోనికి పోయి తలుపు వేసుకున్నాడు!